ప్రజాశక్తి

శుక్రవారం 28 మార్చి 2025

5

కర్నూలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పండగలకు.. ధరాఘాతం...!



- పైపైకి నిత్యావసరాల ధరలు
- ఉగాది, రంజాన్ చేసుకోవాలంటేనే భయపడుతున్న సామాన్యులు

తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగలలో ఉగాది ఒకటి. తెలుగు సంవత్సరం ఆనాడే ప్రారంభం అవుతుంది. మరో వైపు ముస్లిములకు ముఖ్యమైన పండుగ రంజాన్. ఆ రెండూ ఒకే సారే వచ్చాయి. అయితే నిత్యావసరాల ధరలు పైపైకి వెళ్లడంతో ఆ పండగలు చేసుకోవాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. పండగలకూ ధరాఘాతం తప్పడం లేదు. ఉన్న వాటితో సర్దుకుని పండుగ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

ఈ ఏడాది హిందువులకు ముఖ్యమైన ఉగాది, ముస్లిములకు ముఖ్యమైన రంజాన్ పండుగలు వరుసగా వచ్చాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగాది రోజు భక్షాలు ప్రత్యేకంగా చేసుకుంటారు. వాటితో పాటు ఉగాది పచ్చడితో పండగ జరుపుకుంటారు. రంజాన్‌కు ముస్లిములు మాంసం, పాయసం (కీర్) చేసుకుంటారు. ఆ పండుగలకు సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. నిత్యావసరాల ధరలు పైపైకి పెరుగుతుండటంతో పండుగ చేసుకోవాలంటే సామాన్యులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80, చక్కెర కిలో రూ.45గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.180, శనగ బేడలు రూ.120, కిలో మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నంద్యాలలో కిలో శనగ బేడలు రూ.105, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆత్మకూరులో కిలో శనగ బేడలు రూ.100, బెల్లం రూ.80, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.65 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. మరో వైపు మటన్ కిలో రూ.800 నుంచి రూ.900 వరకూ ఉంది. చికెన్ కూడా కిలో రూ.200కు తక్కువేమీ లేదు. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.860గా ఉంది. దీంతో చాలా మంది ఇంట్లో స్టవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన రంజాన్ తోఫా ఇప్పుడు ఇవ్వకపోవడంతో సామాన్యులకు పస్తులు తప్పడం లేదు.

వంట నూనెల మంట..

వంట నూనెలు సల సల కాగుతున్నాయి. లీటరు ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో దిగుమతి సుంకం పెంచింది. ఈ నేపథ్యంలో ధరలు అమాంతంగా పెరిగాయి. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు గత వారం వరకు రూ.1,730 ఉండగా తాజాగా అది రూ.2వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.140-రూ.150కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర వారం క్రితం వరకు రూ.1,530 ఉండగా, ఇప్పుడది రూ.1,730 దాటింది. గతంలో లీటరు పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ.130కి చేరింది. లీటరుకు రూ.20 వరకు పెరిగింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతంగా పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 ఉండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

కందిపప్పూ ఇవ్వని ప్రభుత్వం

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పునీళ్లకు కూడా దూరమయ్యారు.

పండగపూట పస్తులే

ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో చాలీచాలని ఆదాయంతో పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి. చాలీచాలని ఆదాయంతో భక్ష భోజనం, పరమాన్నాలు చేసుకోలేకపోతున్నాం. పిల్లల కోసం అప్పులు చేసి పండగ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- లక్ష్మి, అమీర్ హైదర్ ఖాన్ నగర్, కర్నూలు.

ఉన్నంతలో సర్దుకుంటున్నాం

గత తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రంజాన్ తోఫా ఇచ్చేవాడు. ఈ పండుగకు ఇవ్వకపోవడంతో ఉన్నంతలో సర్దుకుంటున్నాం. రంజాన్ పండగ వచ్చిందంటే ముస్లింలు దానధర్మాలు, చేస్తూ ఉంటారు. ఉన్నవాళ్లు బట్టలు, నిత్యవసర వస్తువులు ఇస్తే వాటిని తీసుకొని ఉపవాసాలు ఉంటూ గడిపాం. పండగ రోజు ఉన్నంతలోనే సర్దుకుని పండగ చేసుకుని సంతోషంగా గడుపుతాం.

- షాజీదాబీ, ప్రకాష్ నగర్, కల్లూరు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- గూడూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలంలోని గ్రామాలలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి. నారాయణ డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవి అధ్యక్షతన గూడూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ, ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటనకు వెళ్ళిన సందర్భంగా అనేక స్థానిక సమస్యలు సిపిఎం బృందం దృష్టికి తెచ్చారన్నారు. చనుగొండ్ల బస్టాండులోని కుంటలో డ్రైనేజీ కాలువ నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతూ దోమల బెడద అధికమైందన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, కుంటను శుభ్రం చేసి రక్షణ కూడా నిర్మించి ఎల్ఎల్‌సి కాల్వ ద్వారా నీటితో నింపి గ్రామ ప్రజలకు మంచినీటిని అందించాలన్నారు. గ్రామంలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించి వృథాగా పోతున్న నీటిని స్టోరేజీ చేసి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల ప్రజలను ఇతర గ్రామాలకు వెళ్లితాగునీరు తెచ్చుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చనుందన్నారు. వెంటనే చెన్న రాయుని రిజర్వాయర్ నుండి పైప్‌లైన్ ద్వారా నాగలాపురం, పెంచికలపాడుకు తాగునీరందించా లన్నారు. గుడిపాడు తాగునీటి కుంటకు రక్షణ గోడ నిర్మించి ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని కోరారు. మునగాల, మల్లాపురం, జూలకల్లు పొన్నకల్, వైఖానాపురం బూడిదపాడు గ్రామాలలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే విడుదలచేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజలందరి కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి-వెల్దుర్తి

తేనెటీగల దాడిలో ఇరిగేషన్, విజిలెన్స్ అధికారులు గాయపడ్డారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో వెల్దుర్తి మండలం ఎల్‌తండా గ్రామ పరిధిలో నిర్మించిన మూడు చెక్ డ్యాంల నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదుల మేరకు గురువారం విజిలెన్స్ జెఇలు ఆనంద్‌బాబు, శ్రీనివాసరావు, ఇరిగేషన్ జెఇ రవినాయక్, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ లు కృష్ణప్రియ, మనోజ్, నారాయణ కలిసి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. చెక్ డ్యాంల పరిశీలన చేస్తుండగా వీరందరిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన వారు కృష్ణప్రియ, మనోజ్, ఆనందబాబు, రవినాయక్, నారాయణ, శ్రీనివాసరావు ఉన్నారు. వెల్దుర్తి మండలంలోనే విధినిర్వహణలో ఉన్న ఇరిగేషన్ ఎఇలు రియాజ్, నాగరాజులు విషయం తెలుసుకొని హుటా హుటిన సంఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెల్దుర్తి సిహెచ్‌సికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. నంతరం అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



గాయపడిన అధికారులు

కార్బైడ్ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలి

- కార్మికులకు ఇవ్వాల్సిన పిఎఫ్ బకాయిలు చెల్లించాలి - భూములను రియల్‌ఎస్టేట్‌కు అమ్మితే సహించం
- విబిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దాదాపు 600 పైగా ఉపాధి కల్పించి మూతబడిన విబిసి (కార్బైడ్) పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని, పరిశ్రమలో పని చేసిన కార్మికుల పిఎఫ్ బకాయిలు చెల్లించకుండా పరిశ్రమ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్మాలని చూస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విబిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, కార్యదర్శి అదిశేషన్న, నాయకులు లక్ష్మన్న, భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు సుందరయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికుల పిఎఫ్ బకాయిలు రూ.2 కోట్లపైన చెల్లించకుండా పరిశ్రమ జోలికి వస్తే సిహించేది లేదని హెచ్చరించారు. కాలయాపన చేస్తూ పరిశ్రమలోని వస్తువులు తరలించాలని చూస్తే కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్తు రంగంలో కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఎండి.అంజిబాబు, కె.భీమేష్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం ఎస్‌ఇ కార్యాలయం దగ్గర ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. నూతనంగా తీసుకున్న ఆపరేటర్లకు పాత వారితో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్స్ స్టోర్ హమాలీ తదితర రంగాలలో పనిచేస్తున్న పీస్ రేటు విధానాన్ని రద్దుచేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సబ్ స్టేషన్‌లోనూ నైట్‌వాచ్మెన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ఏప్రిల్ 7న ఎద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఎస్సీ ఎం ఉమాపతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. ఈ మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తానని రాష్ట్ర వ్యాప్త సమస్యలు పై స్థాయి అధికారులకు వ్రాసి పంపిస్తానని తెలియజేశారు. జిల్లాలో పోల్ టు పోల్ వర్కర్లకు పెయిడ్ హాలిడేస్‌కు సంధించిన డబ్బులు రావడం లేదని తెలియజేయగా వెంటనే వచ్చేటట్లు చూస్తానని తెలిపారు. కోసిగి మండలం వందగల్లు గ్రామంలో ఉన్న ఆపరేటర్లకు పనిభారం తగ్గించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మిగనూరు లో ఉన్న ఎఫ్ఒసి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి జావేద్, జిల్లా నాయకులు పవన్, మల్లికార్జున రెడ్డి, పోతప్ప, హరీష్ గౌడ్, శీను, దేవేందర్ రెడ్డి, స్టోర్ హమాలి యూనియన్ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన వారితో మంత్రి టిజి భరత్

సిఎం సహాయనిధి పేదలకు అండ

17 మందికి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : సిఎంసహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. మంత్రి కార్యాలయంలో 17 మందికి చెక్కులను అందజేశారు. మల్లెపూరి వీర నారాయణకు రూ. 27493, నాటువ వీరాంజనేయులుకు రూ.75,000, ఉమావతి కూతురికి రూ.71,922, ఇండ్ల వెంకటరామయ్యకు రూ.32,324, నాగరకట్ట అబీదా బీకి రూ.81,000, వడ్ల యశోదకు రూ.48,000, వి. ప్రసాద్‌కు రూ.23,420, ఎ.శోభారాణికి రూ.1,22,403, ఎం. హారిక రెడ్డికి రూ.52,833, షేక్ సుఫియాన్‌కి రూ.21,316, మరాఠి షిండే శ్రీనివాస రావుకి రూ.30,000, కనీజ్ ఫాతీమాకి రూ.1,27,786, పింజరి బషీర్ అహ్మద్‌కి రూ.50,933, నారాలీలావతికి రూ.2,30,000, అడ్డేకుల శాంతారాజుకి రూ.29,162, జూటూరు పరమేశ్వరప్పకి రూ.1,20,583, పి. వెంకట సుబ్బయ్యకి రూ. 2,00,000ల చెక్కులను మంత్రి టీజీ భరత్ బాధితులకు అందజేశారు. మొత్తం రూ.13,44,175ల చెక్కులు అందించినట్లు తెలిపారు. ఆపద సమయంలో నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి టీజీ భరత్ ధన్యవాదాలు తెలిపారు.

పేదలను ఆదుకోవడమే నిజమైన పండుగ

-రిటైర్డ్ డిఎస్‌పి మహబూబ్ బాషా, టిడిపి రాష్ట్ర నాయకులు వాహిద్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడం ప్రతి వ్యక్తీ తన కర్తవ్యంగా భావించాలని, పేదలను ఆదుకున్నప్పుడే నిజమైన పండుగని ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షులు, రిటైర్డ్ డిఎస్‌పి మహబూబ్ బాషా అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని నిరుపేద కుటుంబాలకు ఆయత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లను అందించారు. ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి సంతోషంగా జీవించాలని కోరుకోవడమే నిజమైన ప్రార్థన అని అన్నారు. 15ఏళ్లుగా తమ సొంత ఖర్చుతో పేద కుటుంబాలకు పండుగ కిట్లు అందిస్తున్నామని అన్నారు. ఆయత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాము త్వరలో వినూత్న సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహిద్ మాట్లాడుతూ ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ఆయత్ ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయమని అన్నారు. సుమారు వంద కుటుంబాలకు రంజాన్ పండుగ కిట్లను అందించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వహీదాబేగం, సభ్యులు ఆనందరావు, రామమోహన్‌రెడ్డి, వెంకట్రాముడు, నాగేశ్వరబాబు, సూర్యకుమార్, జ్యోతిరాణి పాల్గొన్నారు.

జడ్‌పి కోఆప్టెడ్ సభ్యునిగా ఇలియాజ్ ఖాన్

తుగ్గలి ఎంపిపిగా రాచపాటి రామంజనమ్మ- వెల్దుర్తి ఎంపిపిగా లక్ష్మీదేవి- క్రిష్ణగిరి కోఆప్టెడ్ మెంబర్‌గా షేక్ చిన్న షాలు

అన్ని స్థానాలు వైసిపి కైవసం

ప్రజాశక్తి- విలేకరులు: జిల్లా పరిషత్ కోఆప్టెడ్ సభ్యునిగా ఇలియాజ్‌ఖాన్, తుగ్గలి ఎంపిపిగా రాచపాటి రామాంజనమ్మ, వెల్దుర్తి ఎంపిపిగా దేశాయి లక్ష్మీదేవి, క్రిష్ణగిరి కోఆప్టెడ్ సభ్యునిగా షేక్‌చిన్నషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానిక సంస్థలకు గురువారం ఎన్నిక నిర్వహించారు. అన్నింటినీ వైసిపి ఖైవసం చేసుకుంది.

కర్నూలు అగ్రికల్చర్ : జిల్లా ప్రజా పరిషత్ కోఆప్టెడ్ సభ్యునిగా ఇలియాజ్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ,జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రకటించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సిఇఒ ఛాంబర్‌లో జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్ ఎన్నికకు సంబంధించి ఇలియాజ్ ఖాన్ నుండి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మాట్లాడుతూ స్టేట్ ఎలెక్షన్ కమిషన్ వారి ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్‌ను ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం 10 గంటల లోపు కేవలం 1 నామినేషన్ మాత్రమే వచ్చిందన్నారు. సంబంధిత నామినేషన్ ను స్క్రూటినీ చేసి వాలిడ్ నామినేషన్‌గా డిక్లేర్ చేశామన్నారు. పోటీ ఏమి లేనందున జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్టెడ్ మెంబర్‌గా ఇలియాజ్ ఖాన్‌ను ఏకగ్రీవంగా ప్రకటించామన్నారు. అనంతరం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఇలియాజ్ ఖాన్‌కు డిక్లరేషన్ ఫామ్ అందచేసి ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, జడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కోఆప్టెడ్ సభ్యుడు ఇలియాజ్‌ఖాన్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి రంజిత్‌బాష

తుగ్గలి : తుగ్గలి ఎంపిపి ఉప ఎన్నికలలో వైసిపి అభ్యర్థి శభాష్ పురం ఎంపిటిసి రాచపాటి రామాంజనమ్మ ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి ఎంపిపి హనుమరాజు ఆదెమ్మ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల అధికారి, హెచ్ ఎన్ ఎస్ ప్రాజెక్ట్ భూసేకరణ అధికారి పి. అజయ్ కుమార్ ఎంపిటిసిలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శభాష్ పురం ఎంపిటిసి రాచపాటి రామాంజినమ్మ పోటీకి ముందుకు వచ్చారు. దీంతో సభ్యులందరూ ఆమె ఎంపిపిగా ఉండాలని మద్దతు తెలిపారు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

వెల్దుర్తి: మండలంలో ఖాళీగా ఉన్న ఎంపిపి పదవికి ప్రిసైడింగ్ అధికారి తులసీదేవి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నవ్వ ఎన్నికలను పరిశీలించారు. వెల్దుర్తి ఎంపిపి రవిరెడ్డి, చెరుకులపాడు ఎంపిటిసి రాజేశ్వరిలు ఎల్.బండ ఎంపిటిసిబలపరచారు. వైసిపికి చెందిన 14 ఎంపిటిసిలు, కో ఆప్షన్ మెంబర్ మద్దతు తెలపడంతో లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ కలెక్టర్ నవ్వ, ప్రిసైడింగ్ అధికారి తులసీదేవి లక్ష్మీదేవికి ధృవీకరణ పత్రం అందజేశారు. మండలాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని లక్ష్మీదేవి ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త ఎంపిపి మం డల కన్వీనర్ రవిరెడ్డి, మాజీ జడ్‌పిటసిఇ సమీర్ కుమార్ రెడ్డి, జడ్‌పిటిసి దాదిపోగు సుంకన్న శుభాకాంక్షలు తెలిపారు.

బొమ్మిరెడ్డిపల్లి ఉప సర్పంచిగా రామాంజనేయులు : మండలంలో బొమ్మిరెడ్డి పల్లెలో ఖాళీగా ఉన్న ఉప సర్పంచి పదవికి ఎన్నిక నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారి రవి కిషోర్ ఆధ్వర్యంలో ఐదుగురు వార్డు మెంబర్లు మద్దతు ఇవ్వడంతో రామాంజనేయులు ఉప సర్పంచి గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి కో ఆప్టెడ్ అభ్యర్థిగా చిన్న షాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రిష్ణగిరి కోఆప్టెడ్ మెంబర్ అభ్యర్థి నక్కశాలు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఖాళీ ఏర్పడింది. ఎన్నికల అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్ ఈఎన్ని నిర్వహించారు. మండలంలోని 12 మంది ఎంపీటీసీ గాను 11 మంది వైసిపి ఎంపిటిసిలు ఉన్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవంగా ప్రశాంతంగా ముగిసింది. అనంతరం ఎన్నికల అధికారి డాక్టర్ కె వేణుగోపాల్ చేతుల మీదుగా చిన్న షాలుకు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈ ఎన్నికను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య పర్యవేక్షించారు.



వెల్దుర్తి ఎంపిపి లక్ష్మీదేవికి డిక్లరేషన్ ఇస్తున్న ఎన్నికల అధికారి తులసీదేవి , జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య



తుగ్గలి ఎంపిపి రామాంజినమ్మకు డిక్లరేషన్ ఇస్తున్న ఎన్నికల అధికారి అజయ్‌కుమార్

క్రిష్ణగిరి కోఆప్టెడ్ మెంబర్ చిన్న షాలుకు డిక్లరేషన్ ఇస్తున్న ఎన్నికల అధికారి

సమావేశంలో మాట్లాడుతున్న అవాజ్ నాయకులు

నేటి ఇఫ్తార్ విందు బహిష్కరణ

ముస్లిం పర్సనల్ లా బోర్డు,ముస్లిం మైనారిటీ సంఘాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ముస్లింలు బహిష్కరించాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర మైనారిటీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆవాజ్ నగరకమిటీ ప్రధాన కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్, రాయకులు ఎస్ఎండి షరీఫ్, పిఎస్.మునీర్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ రహిమాన్, అబ్దుల్ దేశాయ్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2024 వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపికి మద్దతు ఇస్తోందని, ముస్లిం మైనారిటీల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఇఫ్తార్ విందులను బహిష్కరించాలని పిలుపునిచ్చిందన్నారు. బీహార్, విజయవాడలోనూ ఇఫ్తార్ విందులను ఇప్పటికే బహిష్కరించారన్నారు. కర్నూలులోనూ అదే విధంగా చెయ్యాలని ముస్లింలు అందరిని కోరారు. వక్ఫ్ చట్ట సవరణ అమలైతే మసీదులు, ఖబర్‌స్తాన్‌లు, మదర్సాలు వంటి ముస్లింల ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్లను, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

నేడు విద్యుత్ సౌధ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్మార్ట్‌మీటర్లను, ట్రూఆప్ ఛార్జీలను రద్దుచేయాలని, విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌసుదేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.ఆనంద్‌బాబు, టి.రాముడు, ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల28న విద్యుత్ సౌధ ఎదుట ధర్నాకు విద్యుత్ వినియోగదారులు భారీ ఎత్తున పాల్గొనాల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలుపెంచడం, సంస్కరణల అమలులో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగించడానికి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి పార్టీల నాయకులు గత ప్రభుత్వానికంటే వేగంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని పేర్కొన్నారు. ట్రూఅప్ చార్జీల భారం దాదాపు రూ.17,000 కోట్లు వేస్తున్నారని వివరించారు. మరిన్ని కోట్ల ట్రూఅప్ చార్జీలు వేయడానికి సిద్ధ పడితే ప్రజలలో వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం భరిస్తుందని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. అందువలన ప్రజలకు భారమవుతున్న విద్యుత్ చార్జీ లు తగ్గించాలని స్మార్ట్ మీటర్ల, ట్రూ అప్ చార్జీ అన్లు రద్దు చేయాలని శుక్రవారం విద్యు త్ సౌదా ముందు జరుగు నిరసన కార్యక్రమంలో వినియోగ దారులు పాల్గొనాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. అంతకుముందు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదోని రహదారిపై బైఠాయించి, దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న మాట్లాడారు. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని కోరారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు అనేక సమస్యలను నాయకులకు వివరించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కనీసం డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడం వల్ల పరిశుభ్రత లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. తాగునీరు పది రోజులకోసారి సరఫరా చేయడం వల్ల తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. పెద్దకడబూరు నుంచి ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలకు రోడ్లు నిర్మించాలని కోరారు. పెద్దకడబూరులోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ భూమిలో కొట్టాలు వేసుకున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాడుపడిన బావిని పూడ్చాలని తెలిపారు. వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు దేవదాసు, ఈరన్న, హనుమంతు, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేలం ద్వారా భారీగా పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - కౌతాళం

వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

మండలంలోని కౌతాళం, హాల్వి పంచాయతీలోని బండి మెట్ట, కమేలా, మార్కెట్లకు నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా ఆదాయం భారీగా పెరిగింది. గురువారం కౌతాళం సర్పంచి పాల్ దినకరన్ అధ్యక్షతన డిఎల్‌పిఒ నూర్జహాన్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలు దక్కించుకోవడానికి పోటీ పడడంతో గతేడాది కంటే రూ.9,05,500 ఆదాయం పెరిగింది. బండి మెట్ట కోసం జరిగిన పోటీలో రూ.11.70 లక్షలకు సంకబేరి రాజు పాటదారుడు దక్కించుకున్నారు. కమేలాను ఎరిగేరి నాబమ్మ రూ.1.05 లక్షలకు దక్కించుకున్నారు. దినసరి మార్కెట్‌ను రూ.15 వేలకు ఎరిగేరి నాబమ్మ దక్కించుకున్నారు. ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచి తిక్కయ్య, పాటదారులు నీలకంఠ రెడ్డి, భీమయ్య, మూకన్న, నబీ, రాజు పాల్గొన్నారు. హాల్వి పంచాయతీలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో గతేడాది కంటే రూ.4.39 లక్షల ఆదాయం పెరిగింది. బండి మెట్టను దర్గా ఖాదర్ బాషా రూ.8.38 లక్షలకు, సంత మార్కెట్‌ను రూ.16,500కు ముత్తన్న దక్కించుకున్నారు. గతేడాది కంటే రూ.4.39 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. వేలం పాటలు ప్రశాంతంగా జరిగేలా సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉప సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం

- భారీ పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి- దేవనకొండ

ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

మండలంలోని వెలమకూరు ఉప సర్పంచిని భారీ పోలీసు బందోబస్తు మధ్య గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, ఎంపిడిఒ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న ఆధ్వర్యంలో ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించారు. ఉప సర్పంచి రెండున్నర ఏళ్ల ఒప్పందం మేరకు గతంలో ఉప సర్పంచిగా కొనసాగిన సుజాత రాజీనామా చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ మేరకు ఎన్నిక నిర్వహించారు. పంచాయతీ పరిధిలో మొత్తం 10 వార్డు సభ్యులకు గాను మెజార్టీగా ఏడుగురు వార్డు సభ్యులు ఎన్నికకు హాజరై ఉప్పర సరస్వతిని ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు స్థానిక సిఐ వంశీనాథ్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు ఎఎస్‌ఐలు, 36 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచి భాస్కర్ పాల్గొన్నారు. ఎన్నికైన ఉప సర్పంచిని పూలమాలలతో సన్మానించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో తాగు, సాగునీరు, ఉపాధి, రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో తాగునీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి కోసం వ్యవసాయ పనులు వదులుకొని ఇంటి దగ్గర ఉండాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. డబ్బులు పెట్టి తాగునీరు కొనే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటికి అవకాశం ఉన్నా మండలంలో రైతులు నోచుకోవడం లేదన్నారు. వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. వలసలను అరికట్టేందుకు పాలకులకు, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉపాధి కూలీలకు ఇప్పటివరకు చేసిన పనికి వేతనం చెల్లించలేదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మండలంలో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించి కోసిగితో పాటు అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ ఉచిత కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పులికనుమ ప్రాజెక్టు ద్వారా కోసిగి రైతులకు సాగునీరు అందించి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్వే గేట్‌పై బ్రిడ్జి నిర్మించాలని, రైల్వే గేట్ అవతల ఉన్న ప్రజలకు చౌక డిపోలు, స్కూల్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ దేవానంద్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు రాముడు, వీరేష్, చిన్నన్న, హనుమంతు, గోపాల్, రైతులు కోసిగయ్య ప్రకాష్, జేజప్ప, రామకృష్ణ, హనుమంతు, నాగేంద్ర, వీర నాగప్ప, తాయన్న, కాళింగ సాయిబన్న, చిన్నారెడ్డి, శ్రీనివాసులు, వీరేష్, గోవిందు పాల్గొన్నారు.



రీ సర్వే డిటికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేతన్నకు ఉచిత విద్యుత్‌పై హర్షం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు, చేనేత మగ్గాలకు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు భరణి కాలప్ప, కరె కృష్ణ, కామర్తి లక్ష్మన్న హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఉచిత విద్యుత్ కల్పిస్తూ జిఒ 44ను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దీనివల్ల 93 వేల మంది చేనేత కార్మికులకు 10,534 మగ్గాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులకు నేతన్న నేస్తం కింద రూ.24 వేలు ఇచ్చేదని, దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ముద్ర రుణాలను, మహాత్మ గాంధీ చేనేత యోజన కింద రుణ సహాయాన్ని అందించేదని తెలిపారు. ఎమ్మిగనూరులో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. పట్టణంలో చేనేత కార్మికుల ఉపాధి కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని, ఆ హామీని ఇంతవరకు నెరవేర్చక పోయాయని విమర్శించారు. చేనేత కార్మికులకు సబ్సిడీపై ముడి సరుకులు ఇచ్చి, వారు నేసిన వస్త్రాలకు మార్కెట్ ధర కల్పించడానికి ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఎమ్మిగనూరులో ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, మగ్గాలకు వర్క్ షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వృత్తి సంఘాల జిల్లా నాయకులు పి.గోవిందు, సిఐటియు నాయకులు రాముడు, చేనేత కార్మిక నాయకులు మోనే తిమ్మప్ప, గడిగే శ్రీనివాసులు, కనికే నాగరాజు, మాదిగుండు రాజు, చాయ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

బిటిని మండలి చైర్మన్‌గా నియమించాలి

- ఘనంగా సన్మానించిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్సీ బిటి.నాయుడు సేవలను గుర్తించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారని, అలాగే మండలి చైర్మన్‌గా బిటి.నాయుడును నియమించాలని టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాష కోరారు. గురువారం ఆదోనిలోని ఎమ్మెల్సీ బిటి.నాయుడు స్వగృహంలో కలిసి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం రావడం హర్షనీయమని, ఇదే స్ఫూర్తితో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. గతంలో కర్నూలు జిల్లా నుంచి శాసనమండలి చైర్మన్‌గా చక్రపాణికి కాంగ్రెస్ పార్టీ బీసీలకు అవకాశం ఇచ్చిందని, మళ్లీ ఆ అవకాశం బిటి.నాయుడు రూపంలో జిల్లాకు రావాలని ఆకాంక్షించారు. మండలి చైర్మన్‌గా టిడిపికి నియమించే అవకాశం ఉంటే నాయుడుకు కచ్చితంగా అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ బిటి.నాయుడును నియోజకవర్గంలోని ఆయా గ్రామాల టిడిపి, ఇతర పార్టీల నాయకులు కలిసి అభినందించారు. టిడిపి నాయకులు మహబూబ్ బాషా, బిజెపి నాయకులు మధు, కిట్టు, రంగస్వామి, జాలిమంచి సర్పంచి గోవిందు, వీరేష్ పాల్గొన్నారు.


బిటిని సన్మానిస్తున్న నాయకులు

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం మాఫీ

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 31లోపు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించే వారికి విధించిన వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ సిబ్బందితో ఆస్తిపన్ను, కుళాయి చార్జీల కలెక్షన్‌పై సమీక్ష నిర్వహించారు. కేవలం 5 రోజుల సమయం మాత్రమే ఉందని, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఆస్తి పన్ను వసూళ్లు సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. 50 శాతం వడ్డీ మాఫీ ఈనెల 31తో ముగుస్తుందని, ప్రజలకు అవగాహన కల్పించి 100 శాతం వసూళ్లు సాధించాలని తెలిపారు. రెవెన్యూ అధికారి అస్లాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సూరిబాబు, షేక్షావలీ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్ రోడ్డు, కర్నూలు బైపాస్ రోడ్డు, చున్నంబట్టి ఏరియాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఉద్యోగులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై కుడా కొరడా

- పది రోజుల్లో అనుమతులు లేని లాడ్జీల సీజ్
- జిల్లా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

జిల్లాలో అక్రమ లేఅవుట్లు, కుడా అనుమతులు లేని నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తూ పది రోజుల గడువులో అనుమతులు పొందని లాడ్జీలను సీజ్ చేస్తామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం స్థానికంగా ఉన్న ప్రయివేట్ లాడ్జీలను, హోమ్‌స్టేలను తనిఖీలు చేసి వాటి అనుమతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ ద్వారా కేవలం గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మూడంతస్తుల వరకే అనుమతులు ఇస్తోందని, ఆపై అంతస్తులకు కుడా అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అలాంటి అనుమతులు లేని వాటిని గుర్తించి 45 లాడ్జీలకు నోటీసులు ఇవ్వగా కేవలం 11 లాడ్జీల యజమానులు మాత్రమే అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికీ స్పందించని లాడ్జీలకు ఉగాది, రంజాన్ పండగ తర్వాత నీటిని, విద్యుత్ సదుపాయాలను కట్ చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. లాడ్జింగ్ ఏరియాలో చివరకు పంచాయతీ రోడ్లను ఆక్రమించడంతో రోడ్లు కుచించుకుపోయాయని, ఆ ప్రదేశంలో లాడ్జీల్లో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే పక్కన ఉన్న లాడ్జీలకు వ్యాపించడం ఖాయమని, అందుకే ఫైర్ స్టేషన్ అనుమతి ఉండాలని సూచించారు. అక్రమ లేఅవుట్లు కూడా చాలా ఉన్నట్లు తెలుస్తోందని, వాటిపై కుడా నిఘా ఉంచి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతామని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ప్రజలకు అందరికీ తెలుసని, ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఇలాంటి కుడా అనుమతులు లేని వారు పొంది ఆర్థికంగా అభివృద్ధి సహకరించాలని కోరారు. జిల్లా లైన్ ఆఫీసర్ విజయ్ భాస్కర్, జిల్లా ప్లాన్ ఆఫీసర్ గోపాల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ఆరా తీస్తున్న ఎంపిడిఒ

రచ్చుమర్రిలో తాగునీటి సమస్యపై ఎంపిడిఒ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో తాగునీటి సమస్యపై ఎంపిడిఒ రాధ ఆరా తీశారు. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీ, మాలపల్లి రహదారి, మాధవరం రహదారిలో ఉన్న కాలనీలో పర్యటించి గ్రామస్తులతో మమేకమై నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడి అంత తీవ్రంగా లేదని, సమీపంలో నీటి గుమ్మలు ఉన్నాయని, దాని ద్వారా నీటి సరఫరా అవుతోందని చెప్పారు. ఆర్ఒ ప్లాంట్ల నుంచి కూడా గ్రామస్తులు తాగునీటిని కొని తెచ్చుకుంటున్నారని, త్వరలో జలజీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, వైసిపి నాయకులు మేకల నారాయణ ఉన్నారు.

సుజయీంద్ర నగర్‌లో ఆక్రమణలు తొలగించండి

- ఇఒఆర్‌డికి కాలనీ వాసుల మొర

వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని సుజయీంద్ర నగర్ కాలనీలో ఆక్రమణకు గురైన రోడ్డును తొలగించాలని కాలనీ వాసులు ఇఒఆర్‌డి ప్రభావతితో మొర పెట్టుకున్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం చేరుకుని ఆమెకు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, కార్యదర్శి నాగరాజు సమక్షంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు కాలనీలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా బండలు పాతి ఆక్రమించడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రవి, కులకర్ణి, సుయతీంద్ర పాల్గొన్నారు.

శ్రీమఠంలోని అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం నిర్వహణలో కొనసాగుతున్న నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన శశికాంత్ అనే భక్తుడు రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం మేనేజర్ వెంకటేష్ జోషిని కలుసుకొని రూ.లక్ష విరాళం అందజేశారు.

చైర్మన్ శాంతకు న్యాయం చేయాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ చైర్మన్ శాంత చేస్తున్న దీక్షకు స్పందించి న్యాయం చేసి, నిరసనను విరమించేలా చూడాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. అవినీతి మరకలేని మున్సిపల్ చైర్మన్ శాంత ఆదోని రాజకీయ ఉచ్చులో కూరుకుపోయారని తెలిపారు. అలాంటి వ్యక్తిని పదవి నుంచి దించేందుకు అవిశ్వాస తీర్మానం నిర్ణయం మంచిది కాదన్నారు. స్పష్టమైన హామీ ఇచ్చి ఆమె ఆందోళన విరమించేలా వైసిపి అధిష్టానం చొరవ చూపాలని కోరారు. లేకపోతే సమస్య చెయ్యి దాటే అవకాశం లేకపోలేదని తెలిపారు.

ఆర్ఐఒను తక్షణమే సస్పెండ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి- దేవనకొండ

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారి, కర్నూలు ఆర్ఐఒ గురవయ్య శెట్టిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురవయ్య శెట్టి ఆర్ఐఒగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు స్పందించి, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఐఒను సస్పెండ్ చేసి, ఆయన అవినీతి, అక్రమాలపై సిబిఐ, సిఐడితో విచారణ జరిపించాలని కోరారు. ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని, ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ మండల కోశాధికారి సురేంద్ర, నాయకులు భరత్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆదోని ప్రభుత్వ మాత, శిశు ఆస్పత్రి ఆవరణలో కేక్ కట్ చేసి అక్కడున్న రోగులకు, వారి బంధువులకు అన్నదానం చేశారు. అలాగే బసరకోడు గ్రామంలో రామ్‌చరణ్ వీరాభిమాని సాయికుమార్ సౌజన్యంతో ఉచిత తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సాయికుమార్, రమణ, చిరుత రాజశేఖర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రేణువర్మ, మండల అధ్యక్షులు ఎం.తాహేర్ వలీ మాట్లాడారు. సేవా భావం కలిగిన మెగా అభిమానులు బసరకోడు గ్రామానికి ఉచితంగా రెండు ట్యాంకర్లతో తాగునీరు అందించినట్లు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి ఆశయం మేరకు సేవా భావంతో రక్తదానం, ఉచిత తాగునీరు సరఫరా చేసి పట్టణ మాత, శిశు ఆస్పత్రి దగ్గర భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మెగా అభిమానులు వీరేష్, గౌస్, వలీ, రాజు, జనసేన నాయకులు శ్యామ్, అంజి యాదవ్, మహేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ తాలూకా నాయకులు, మెగా పవర్ స్టార్ ఫ్యామిలీ ఫ్యాన్స్ సమితి అధ్యక్షులు బీసీ.నాగరాజు, పవన్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఐదు చోట్ల జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా టౌన్ ఎస్ఐ కృష్ణ నాయుడు, ఎంఎస్ జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, మల్లెల గ్రూపు అధినేత, సామాజిక వేత్త డాక్టర్ ఆల్ఫ్రెడ్ రాజు, టిడిపి ఫ్లోర్ లీడర్, మున్సిపల్ కౌన్సిలర్ విజి.దయాసాగర్, మాజీ కౌన్సిలర్ మధు బాబు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చేనేత శివ, పట్టణ ఓబీసీ అధ్యక్షులు బండా రవికుమార్, రామ్ చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు భరత్ పాల్గొన్నారు.

ఆదోనిలో అన్నదానం చేస్తున్న అభిమానులు

ఎమ్మిగనూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆల్ఫ్రెడ్ రాజు

'ఆర్‌పిల హామీలను అమలు చేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర మెప్మా ఎమ్‌డి ఆర్‌డిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మెప్మా సంఘ జిల్లా కార్యదర్శి ఉమాదేవి, అధ్యక్షులు రుద్రమ్మ, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మెప్మా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మెప్మా ఆర్‌పిల సమస్యలపై చేపట్టిన ఆందోళన సందర్భంగా విజయవాడలో మెప్మా ఎమ్‌డి 9 హామీలు ఇచ్చారని తెలిపారు. ఈ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు మున్సిపల్ మెప్మా ఆర్‌పిల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ బండ సునీత, సావిత్రమ్మ, సభ్యులు రూతమ్మ, శివ గంగమ్మ, పద్మ, ఖాతూన్ బీ, నూర్జహాన్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీగా భాస్కర్

ప్రజాశక్తి - ఆదోని

ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీగా భాస్కర్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. ఫ్యాప్టో జిల్లా ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కె.ప్రకాష్ రావు ఆధ్వర్యంలో జరిగాయన్నారు. బిటిఎ జిల్లా అధ్యక్షులైన తనను జిల్లా జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం, అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనను ఉపాధ్యాయులందరూ జయప్రదం చేయాలని కోరారు.

భానుడి భగభగలు..!

- ఇంట్లో ఉంటే ఉక్కపోత..
బయటకొస్తే ఎండలు
- ఉదయం 8 నుంచే అధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - హోళగుంద

భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోతకు గురవుతుంటే... బయటికి వెళ్తే ఎండలు మండుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. గత రెండు రోజులుగా అక్కడక్కడ చినుకులు పడుతున్నా ఉదయం 8 నుంచి 41 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భగభగమంటూ ఎండలు దంచి కొడుతుండడంతో ముఖ్యమైన పనులను వదులుకోలేక ఎండలు బయటికి వెళ్లాక తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది ఎండలు మార్చిలోనే దంచి కొడుతున్నాయి. మే, జూన్ నెలల్లో ఉష్ణోగ్రతల అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురిసినా వేడి మాత్రం తగ్గక రాత్రనక, పగలనక ఇంట్లో ఉక్కపోతతో అల్లాడిపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. రేపటి నుంచి మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు, చిన్న పరిశ్రమల కార్మికులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. చిన్న పరిశ్రమల యాజమాన్యం, ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులను, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తాగునీరు, నీడ అవసరం : వేసవి మొదలైందంటే ప్రతి ఒక్కరికీ తాగునీరు, ఎండ వేడిని తట్టుకోవడానికి నీడ అవసరం. ఉపాధి కూలీలకు పనులు కల్పించే ప్రదేశంలో కచ్చితంగా టెంట్లు ఏర్పాటు చేసి, తాగునీరు అందుబాటులో ఉంచాలి. ప్రయివేట్, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

చలివేంద్రాలు పెరగాలి : గ్రామీణ, మండల, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా జనసంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాల సంఖ్య పెరగాలి. అప్పుడే ఎండలో వచ్చిన వారి దాహం తీర్చవచ్చని కోరుతున్నారు. గతంలో ఆయా శాఖల అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ఈ ఏడాది కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు అక్కడక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేసినా ఇంకా జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు అవసరం : ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వైద్యులు ప్రతి గ్రామాన్నీ సందర్శించి ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా సలహాలు, సూచనలు ఇచ్చి రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వడదెబ్బ ఎలా వస్తుంది.. వడదెబ్బ లక్షణాలు ఏమిటి.. వడదెబ్బకు గురైనప్పుడు మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి అనే కోణంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రైల్వే బ్రిడ్జి పనులు షురు

- న్యాయం చేయాలని బాధితుల మొర

ప్రజాశక్తి - ఆదోని

రైల్వే ఇంజినీర్‌ను కోరుతున్న బాధితులు

పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి రైల్వే గేటు మీదుగా బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రైల్వే అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ ఉమాపతి తెలిపారు. గురువారం ఈఎస్ఐ ఆస్పత్రి భాష్యం స్కూల్ రోడ్డులో సర్వే పనులను పరిశీలించారు. అక్కడ ఇల్లు కోల్పోతున్న బాధితులు ఆయనతో మొరపెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కాపురం చేస్తున్నామని, ఉన్నపలంగా తొలగించడం వల్ల తాము ఎక్కడికి వెళ్లలేమంటూ వాపోయారు. అలైన్మెంట్ చేంజ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉమాపతి మాట్లాడారు. అలైన్మెంట్ చేంజ్ చేసే అధికారం తమ పరిధిలో లేదని చెప్పారు. నష్టపరిహారం, న్యాయం జరగాలన్న కలెక్టర్ పరిధిలో ఉంటుందని నచ్చజెప్పారు. డీఎస్పీ బంగ్లా నుంచి 195 రైల్వే గేటు మీదుగా శంకర్ నగర్‌కు వెళ్లే రోడ్డు వరకు బ్రిడ్జి వెళ్తుందన్నారు. సుమారు రూ.60 కోట్ల వ్యయం అవుతుందని, 870 మీటర్ల పొడవు ఉంటుందని తెలిపారు. 30 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి, సర్వీస్ రోడ్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. సర్వే పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలవుతాయని తెలిపారు. గతంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వేయాలని ప్రతిపాదన ఉన్నా టెక్నికల్ సమస్య కారణంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పట్టణంలోని ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గుతుందని పలువురు పేర్కొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

- కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేసిన గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సామాజిక సేవనే మనస్సుకు సంతృప్తినిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కోర్టు, సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి అంతా శుభ్రం చేసి మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణంలో కోర్టు, తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో గల ప్రాంతంలో సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆదోని కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆదర్శంగా తీసుకొని ఈ కార్యక్రమానికి గత జనవరి 19న శ్రీకారం చుట్టామన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, మాజీ కౌన్సిలర్ మారుతి, బైచిగేరి ఓంకార్, సాధిక్ వలీ, కపటి మహదేవ, మునిస్వామి, చంద్ర, వెంకటేష్, పురుషోత్తం,కుప్పగల్లు హనుమంతు, ఆంజనేయులు, బాబురావు, పరమేష్, ఆటో రెడ్డి, ఖాసీం, అశోక్, రామాంజి, రాజు, ఈరసింగ్, మల్లయ్య, సవారి, సుంకన్న, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, నాగరాజు, విజయ్, చిరంజీవి, చిట్టి, పెద్ద చిట్టి, రంగన్న, రామకృష్ణ, రాఘవేంద్ర ఉన్నారు.